క్లుప్తంగా

ఆకట్టుకున్న ముగ్గులు



వాల్మీకిపురం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలో మహిళలు వారి వారి ఇళ్ల ముందు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గిపిండితో ముగ్గులు వేసి, కల్లర్లతో నింపి, ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి చూపరులను ఆకట్టుకునే విధంగా ముగ్గును ఏర్పాటు చేశారు. అలాగే ఉదయం భోగి సందర్భంగా ఇళ్ల ముందు పాత వస్తువులను తగలబెట్టి భోగి పండుగను జరుపుకున్నారు.

సంక్రాంతి క్రికెట్ పోటీలు

వాల్మీకిపురం: పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఆదివారం సంక్రాంతి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కేశవ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీపేట రఘు, క్రీడాకారులు గణేష్, రవికుమార్, వెంకటేష్, శ్రీనివాసులు, బాలక్రిష్ణ, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 పాయింట్ల కమిటీ సభ్యుడిగా మాలిక్

బి.కొత్తకోట: ప్రధానమంత్రి కొత్త 15 పాయింట్ల కార్యక్రమాల అమలు పర్యవేక్షణ కమిటీ జిల్లా సభ్యుడిగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మాలిక్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీ సభ్యునిగా మైనార్టీ అంశాలపై పరిశీలన, పరవ్యవేక్షించవచ్చని ఉత్తర్వులో సూచించారు.

18న బాపట్లలో వీసీకే పార్టీ సదస్సు

మదనపల్లె : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు వీసీకే పార్టీ పోటీచేస్తున్న నేపథ్యంలో బూత్‌లెవల్ కమిటీల ఏర్పాటు, విధి విధానాలపై నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 18న బాపట్లలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ తెలిపారు. ఆదివారం వీసీకే పార్టీ విడుదల చేసిన ప్రకటనలో...వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్.తోల్‌తిరుమావళన్ ఆదేశాల మేరకు చెన్నైలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజులు జరిగిన హైలెవల్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో వీసీకే పార్టీ పోటీచేస్తున్న 6 పార్లమెంటు, 50 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తొలి జాబితాను రూపొందించి, వాటికి ఇన్‌చార్జ్‌లను నియమించామన్నారు. ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు వీసీకే పార్టీ చెంగల్‌పట్టు ఎమ్మెల్యే బాబు, సెంట్రల్ ఆఫీస్ సెక్రటరీ బాలసింగంలు హాజరవుతున్నట్లు శివప్రసాద్ తెలిపారు.

భోగ భాగ్యాలకు ప్రతీక భోగి

మదనపల్లె సిటీ: పట్టణంలో ఆదివారం భోగి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాలనీల్లో ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. ఇంటిలోని పాత వస్తువులను మంటల్లో వేసి కాల్చివేశారు. తల్లిదండ్రులు చిన్నారులకు తలపై రేగిపండ్లు వేసి ఆశీర్వదించారు. ఇళ్ల ముందు సంక్రాంతి ముగ్గులు వేశారు. పలు రకాల రంగులతో ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. ఇళ్ల ముందు ముగ్గులు ఆకట్టుకున్నాయి. శివనగర్‌లో అన్ని కుటుంబాలు కలిసి సామూహిక భోగి సంబరాలు నిర్వహించారు. అందరూ కలిసి పండుగను కలిసి చేసుకోవడం సంతోషకరమన్నారు.

ఘనంగా గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం

స్థానిక బర్మావీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో గోదాదేవి,రంగనాథస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయం ఆవరణంలో గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని, రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. వివాహానికి జరిగే తంతులా వేదపండితులు నరసింహాచార్యులు నిర్వహించారు. వివాహానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పీలేరులో..

పీలేరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా పీలేరు పట్టణంలో భోగి పండుగ ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారి జామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. సమాజంలో చీకటి తొలగిపోయి వెలుగులు నింపాలని కోరుకున్నారు. స్థానిక నెహ్రూ బజార్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, వాసవిక్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. మహిళలు చేసిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కేవీపల్లెలో..



మదనపల్లె: భోగి మంటల వద్ద శివనగర్ కాలనీవాసులు



గుర్రంకొండలో ఇళ్ల ముందు భోగి మంటలు

కేవీపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో భోగ భాగ్యాలకు ప్రతీకగా భోగి మంటలు వేశారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారిజాము నుంచే భోగిమంటలు వేశారు. ప్రతి కుటుంబంలో సమస్యలనే చీకటి తొలగి, సుఖ, సంతోషాలనే వెలుగు నింపాలని కోరుకున్నారు. భోగిమంటల్లో ప్రసాదం వండుకుని అందరికీ పంచిపెట్టారు. పిండి వంటలు చేసుకుని బంధువులతో, మిత్రులతో కలసి సంబరాలు చేసుకున్నారు.

ఘనంగా భోగి సంబరాలు

తంబళ్లపల్లె: మండలంలో ఊరూవాడ ఆదివారం భోగిపండుగ సంబరాలు ఘనంగా సంతోషంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిముంగిట తెల్లవారుజామున భోగిమంటలు వేశారు. ఇంటి ముంగిళ్లలో ఆకర్షణీయంగా సంక్రాంతి ముగ్గులు వేసి అందులో గొబ్బెమలు పెట్టి గుమ్మిడి, తంగేడు పూలు, గరికపాసలతో అలంకరించారు. గొబ్బెమలు పాటలు పాడి ఆనందాన్ని పంచుకున్నారు. పలు రకాల పిండి వంటలతో విందుభోజనలు చేశారు. పల్లెల్లో ఎద్దులు, పాడి ఆవులను అలంకరించారు. కాటమరాజు వరకూ భాజభజంత్రీలు, బాణాసంచాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేశారు. చిట్లీకుప్పెకు నిప్పు పెట్టి ఆవులను బెదిరించారు.

కురుబలకోటలో..

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం భోగి పండగను ఘనంగా నిర్వహించారు. భోగి భోగ భాగ్యాలను ఇస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి తెలిపారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామునే ఇళ్ల ముందర భోగి మంటలు వేసుకొన్నారు. ఇళ్లలోని పాత వస్తువులతో పాటు మరిన్ని రకాల కట్టెలను తీసుకొచ్చి ఇళ్ల ముందర పెద్ద ఎత్తున మంటలు వేసుకొన్నారు. ఇళ్లకు ఉండే దిష్టిపోవాలంటూ దేవుడ్ని కొలిచారు. పిల్లలు,పెద్దలు ఉత్సాహంగా భోగిపండుగ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నపిల్లలకు రేగిపళ్లతో సాంప్రదాయబద్దంగా స్నానం చేయించారు.

మకర సంక్రాంతి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఎస్.నిసార్‌అహ్మద్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ... సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగని, గ్రామాలకు నూతన శోభను తెచ్చే పర్వదినమని, మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రోజన్నారు. భోగిమంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, పైరుపచ్చల కళకళలు, రైతు లోగిళ్లలో ధాన్యరాశులు, పిండివంటల ఘుమఘుమలు, బంధుమిత్రుల సందళ్లతో ప్రతి ఇల్లు కళకళలాడాలన్నారు. జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి గ్రామంలో కోటి రూపాయలకు పైగా విలువచేసే గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, బీఎంసీ యూనిట్లు ఏర్పాటయ్యాయన్నారు. భోగ భాగ్యాలను అందించే భోగి...కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమపండుగలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని మనసారా ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్తకు శుభాకాంక్షల వెల్లువ

మదనపల్లె : వైఎస్సార్ సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం రామసముద్రం జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి సోదరుడు కలిచెర్ల సుధాకరరెడ్డి నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం పట్టణంలోని జేసీఎం చర్చి, ప్యారానగర్‌లోని మసీదును సందర్శించి మతగురువుల ఆశీర్వాదం తీసుకున్నారు.

విశేష అలంకరణలో నల్ల గంగమ్మ



అమ్మవారి సన్నిధిలో మదనపల్లి ఆర్డీఓ

నంబేపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మ విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కాగా అమ్మవారిని మదనపల్లె ఆర్డీఓ మురళీ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆయనకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, సంఘ సేవకుడు భువనేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కురబలకోట: వేణుగోపాల స్వామి ఆలయంలో..

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్థనస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా గోదాదేవి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్ , అనిల్ వేదమంత్రాలతో గోదాదేవి కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కళ్యాణోత్సవంను తిలకించారు. అనంతరం భక్తులకు మహామంగళహారతి తీర్థప్రసాదాలు అందజేశారు.

కురబలకోటలో..

కురబలకోట: మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుని ఆదివారం గోదా దేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథ రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె వాసవి క్లబ్ సహకారంతో అట్టహాసంగా జరిగింది. గోదా దేవి కల్యాణం ఆమె నిర్మల భక్తికి నిదర్శనమని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. భక్తి శ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు.

కేబీఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలలో పాల్గొన్న కొల్లం గంగిరెడ్డి

పుల్లంపేట : డీసీసీబీ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కీ.శే.కొల్లం బ్రహ్మానంద రెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లం గంగిరెడ్డి మాట్లాడుతూ తన అన్న కొల్లం బ్రహ్మానందరెడ్డి జ్ఞాపకార్థం ప్రతి సంక్రాంతికి తమ గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఆయన తెలియజేశారు. విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ముద్దా రామసుబ్బారెడ్డి, కొల్లం యస్పాల్ రెడ్డి, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న తలమంచి గిరీషా రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో రెయిన్‌బో టీమ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. గిరీష్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన ఈ టోర్నీలో మొదటి బహుమతి కింద లక్ష రూపాయలు, రెండవ బహుమతి కింద రూ. 50 వేలు ప్రకటించడంతో టోర్నీ ఆసక్తిగా సాగుతోంది.

ఆశాజనకంగా అనప, బంతిపూల ధరలు

రామసముద్రం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అనప, బంతిపూల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా బంతిపూలు కిలో రూ.10 ఉండగా పండుగ సందర్భంగా కిలో రూ.40కి పెరిగాయి. అలాగే అనప కిలో రూ.30 ఉండగా కిలో రూ.50 నుంచి రూ.70 లకు పెరిగాయి. పండుగ సందర్భంగా ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులకు కొంత ఊరటగా ఉన్న కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. పండుగ సందర్భంగా పశువులను అలంకరించి పండుగ చేసే సామాన్య రైతులు తగు మాత్రం పూలతో సర్దుకుంటున్నారు. గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటి ముగింట రంగురంగు ముగ్గులు వేశారు.

వలంటీర్ల నూతన కమిటీ ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ వలంటీర్ల నూతన కమిటీని ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఆవుల విశ్వనాథ్, బి.సుగుణ, ప్రధాన కార్యదర్శిగా షేక్ సలామత్, కోశాధికారిగా భానుప్రకాష్, సంయుక్త కార్యదర్శులుగా నజీర్‌బాషా, సుదర్శన్, పుసుపులేటి కిషోర్ కుమార్, వెంకటేష్, సుహేల్, ప్రచార కార్యదర్శులుగా బి.హరి, అల్తాఫ్, హారున్, సంతోష్, రాయల్పాడు శిరీష, కార్యవర్గసభ్యులుగా అహ్మది నిగర్, అస్మత్, జాఫర్, మనోహర్, జాన్ ఎన్నుకున్నట్లు గ్రామ వార్డ్ వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జామల్‌వల్లి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నవాజ్‌బాషాను నూతన కార్యవర్గ సభ్యులు కలిశారు.

11 మంది కోడిపందెంరాయుళ్ల అరెస్ట్

పీలేరు రూరల్ : మండలంలో 11 మంది కోడిపందెం రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 12,200 నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం పీలేరు పట్టణ శివారు ప్రాంతం ఇటుక బట్టీల వద్ద కోడిపందెం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తట్టిశ్రీనివాసులురెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి

మదనపల్లె : ఎంపీ మిథున్‌రెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్‌యార్డు చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్.అనిల్‌కుమార్, బాలగంగాధరరెడ్డి, నిమ్మనపల్లె రమణారెడ్డి, శేషాద్రిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, సుధాకరరెడ్డి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పాఠశాల పూర్వ విద్యార్థులు

కలకడ : మండలంలోని కోన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 మధ్య చదివిన ఆ పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు 15 సంవత్సరాల తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలలో ఆదివారం సందడి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయుల త్యాగాలను, విద్యాభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడి వారి ఆశీస్సులు పొందాలు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు ప్రింటర్ వితరణ చేసి పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటామని హామీ ఇచ్చారు. నాటి ఉపాధ్యాయులు గంగాధర్‌నాయక్, చంద్రశేఖర్, సురేష్, రెడ్డిశేఖర్, గఫార్‌ఖాన్, నవాజ్‌ఖాన్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, గంగాధర్‌నాయక్, మోహన్‌కుమార్‌లను సన్మానించారు.

రెడ్డెమ్మతల్లీ.. కరుణించమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లిని భక్తులు కరుణించమ్మా అంటూ మొక్కుకొన్నారు. ఆదివారం భోగి పండుగ మరోవైపు శెలవులు కావడంతో అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు.